క్లుప్తంగా

ఉగాది రోజు తెరుచుకున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

తాడిపత్రిటౌన్: పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఆదివారం తెరుచుకుంది. ఉగాది పర్వదినంతో పాటు ఆదివారం సెలవు అయినప్పటికి ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు, సిబ్బంది హాజరై విధులు నిర్వహించారు. కాగా మూడు మార్ట్‌గేజ్ రిజిస్ట్రేషన్లు అయినట్లు సబ్ రిజిస్టర్ శివనారాయణ తెలిపారు. సోమవారం రంజాన్ పండుగ రోజు కూడా కార్యాలయం తెరిచే ఉంటుందన్నారు. ఆయనతో పాటు సీనియర్ అసిస్టెంట్ మంజుల, సురేష్, జూనియర్ అసిస్టెంట్ మణికంఠ, అంటెండర్ రవి తదితరులు విధులు నిర్వహించారు.

'మౌలిక వసతులు కల్పించండి'

పామిడి: మండలంలోని రామగిరి ఎగువ తండా గ్రామంలో మౌలిక వసతుల కల్పించాలని రామగిరి ఎంపీటీసీ మజ్జిగ రాజశేఖర్ కోరారు. ఈ మేరకు ఆయన ఎంపీడీఓ కే తేజోత్స్నకు ఆదివారం విన్నవించారు. డ్రైనేజీ నీరంతా రోడ్లపై ప్రవహిస్తూ పాదచారులు, వాహనచోదకుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా ఉందన్నారు. అలాగే నీటి సమస్యతో ప్రజలు తల్లడిల్లుతున్నారన్నారు. సమస్యలను తక్షణం పరిష్కరించాలని ఆయన ఎంపీడీఓను కోరారు.

పాస్టర్ ప్రవీణ్ మృతికి సంతాపం



కొవ్వొత్తులతో సంతాపం వ్యక్తం చేస్తున్న సీఎస్ఐ చర్చి సభ్యులు

పామిడి: పాస్టర్ ప్రవీణ్ ఆత్మకు శాంతి చేకూరేలా దైవసేవకుడు పీపీఎస్ రాజు ఆధ్వర్యంలో పట్టణంలోని సీఎస్ఐ చర్చిలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మృతి పట్ల రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో టీచర్ ప్రిస్కిల్లా, సుమిత్‌రాజ్, చర్చి సభ్యులు, జకరయ్య, బాబావలి, రాజు, రమణ, కరుణాకర్, ప్రసాద్, రజిని, రేచెల్, వాణి, డాక్టర్ కమల, సుశీలమ్మ, చంద్రకళ, శాంతమ్మ, మాణిక్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు

గుత్తి: పట్టణంలోని తాడిపత్రి రోడ్డులో ఆదివారం ఆటోలో నుంచి జారి పడి రంగయ్య అనే వ్యక్తి గాయపడ్డాడు. గుత్తికి చెందిన రంగయ్య ఆర్‌ఎస్‌కు ఆటోలో వెళుతుండగా.. స్పీడ్ బ్రేకర్ వద్ద జారి కింద పడ్డాడు. స్థానికులు గమనించి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రైతుకు ఆర్థిక సాయం

శింగనమల: మండలంలోని చిన్నజలాలపురంలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో రైతు వెంకటేశ్వర్లుకు చెందిన రూ.2 లక్షలు విలువ చేసే పశుగ్రాసం కాలిపోయింది. స్పందించిన వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకటరమణ ఆదివారం రైతు ఇంటికి వెళ్లి రూ.10 వేలు ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



పామిడిలో పంచాగ శ్రవణం చేస్తున్న పీఠాధిపతి సురేంద్ర మహారాజ్



పెద్దవడుగూరులో చెన్నకేశవస్వామి ప్రతిమలను ఊరేగిస్తున్న దృశ్యం



బుక్కరాయసముద్రం మండలం నీలాంపల్లిలో ఎడ్ల బండ్ల పోటీలు

వైభవంగా ఉగాది వేడుకలు



గుత్తిలోని కాశీ విశ్వేశ్వరాలయంలో పూజలు చేస్తున్న దృశ్యం



గుంతకల్లులో వేంకటేశ్వరస్వామికి ధాన్యాన్ని సమర్పిస్తున్న భక్తులు



తాడిపత్రిలో బుగ్గ రామలింగేశ్వరుడు



అలంకరణలో పార్వతీదేవి మాత

తాడిపత్రిరూరల్/గుంతకల్లుటౌన్/గుత్తి/గుత్తి రూరల్/పామిడి/శింగనమల/గార్లదిన్నె/యల్లనూరు/బుక్కరాయసముద్రం/పెద్దవడుగూరు: తాడిపత్రి, గుంతకల్లు, శింగనమల నియోజకవర్గాల్లో ఆదివారం ఉగాది పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పలు దేవాలయాల్లో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఆలయాల వద్ద కమిటీ సభ్యులు అన్నదానం చేశారు. గ్రామాల్లో యువత టెంకాయ విసురు పందెం, రాతి గుండు ఎత్తడం, కబడ్డీ పోటీల్లో సరదాగా గడిపారు. అలాగే అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా దేవాలయాల వద్ద పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

● ఆకట్టుకున్న గ్రామీణ క్రీడాపోటీలు



కల్లూరులో ఇసుక మూట మోసుకెళ్తున్న యువకులు



తాడిపత్రిలో ఇరుసు ఎత్తుతున్న క్రీడాకారుడు

తాడిపత్రి టౌన్/గార్లదిన్నె: ఉగాది పర్వదినం సందర్భంగా స్థానిక పెన్నానది ఒడ్డున ఆదివారం సాయంత్రం నిర్వహించిన గ్రామీణ క్రీడా పోటీలు ఆకట్టుకున్నాయి. ఇరుసు, రాతిగుండ్లు, ఇసుక బస్తాలు ఎత్తు పోటీల్లో పెద్ద సంఖ్యలో యువకులు పాల్గొన్నారు. పోటీల్లో విజేతలకు నగదు బహుమతులు, షీల్డ్‌లను అందజేసారు. అలాగే గార్లదిన్నె మండలం కల్లూరు ఇసుక మూట మోసే పోటీలు నిర్వహించారు. పోటీలు ఆరంభం నుంచే హోరాహోరీగా సాగాయి. ఎక్కువ దూరం ఇసుక మూటను మోసుకెళ్లిన యువకుడికి నగదు పురస్కారాలతో గ్రామస్తులు సత్కరించారు.

గ్రామాల్లో ఉత్సాహంగా ఉగాది సేద్యం



గొందిపల్లిలో గుంటక పాస్తున్న రైతు

గుత్తి రూరల్: మండలంలోని గొందిపల్లి, తురకపల్లి, కరిడికొండ, తొండపాడు, అబ్బేదొడ్డి, బేతాపల్లి, కొత్తపేట, వన్నేదొడ్డి, మాముడూరు, అనగానదొడ్డి, బసినేపల్లి, లచ్చానపల్లితో పాటు ఇతర గ్రామాల్లో రైతులు ఉగాది సేద్యం చేశారు. ఉగాది రోజు గుంటకతో పొలం దున్ని సంప్రదాయ, ఆచారాలను పాటిస్తూ కల్మషం లేని చిన్నారులతో సేద్యం పనులను ప్రారంభిస్తే పంటలు బాగా పండుతాయని నమ్మకం. దీంతో ఆదివారం వేకువజామునే పిల్లలకు నూతన వస్త్రాలను ధరింపజేసి పొలాలకు తీసుకెళ్లారు. గొర్రు, నాగలికి పసుపు కుంకుమ పూసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎద్దులను ప్రత్యేకంగా అలంకరించి చిన్నారుల చేతుల మీదుగా సేద్యం పనులను ప్రారంభించారు. అనంతరం పొలాల్లో రైతులు గుంటక పాశారు. ఎద్దులకు ప్రత్యేక పూజలు చేసి ఈ ఏడాది పంటలు సమృద్ధిగా పండాలని కోరుకున్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో ఆలయాల చుట్టూ ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లు తిప్పారు.

తాడిపత్రికి చేరుకున్న ఫయాజ్

- పట్టణంలో భారీ పోలీస్ బందోబస్తు



పోలీస్ బందోబస్తుతో తాడిపత్రిలోని తన ఇంటికి చేరుకుంటున్న ఫయాజ్‌బాషా

తాడిపత్రి టౌన్: భారీ పోలీసు బందోబస్తు మధ్య తాడిపత్రి వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకుడు, మున్సిపల్ కౌన్సిలర్ ఫయాజ్‌బాషా తన ఇంటికి ఆదివారం చేరుకున్నారు. ఈ నెల 29న వైఎస్సార్‌సీపీ అధిష్టానం ఆదేశాల మేరకు మాజీ డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా, పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంతవెంకట్రామిరెడ్డి.. అనంతపురంలో ఎస్పీ జగదీష్‌ను కలసి సమస్యను వివరించిన విషయం తెలిసిందే. దీంతో తాడిపత్రికి వెళ్లేందుకు ఫయాజ్‌బాషాకు ఎస్పీ అనుమతించారు. ఈ నెల 23న తన నూతన గృహంలో ఇఫ్తార్ విందును ఫయాజ్ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఇది గిట్టని జేసీ అనుచరులు పెద్ద సంఖ్యలో ఫయాజ్ ఇంటిని చుట్టుముట్టి రాళ్ల దాడికి తెగబడ్డారు. దాడి చేసింది టీడీపీ వారైతే... పోలీసులు వైఎస్సార్‌సీపీ నాయకులు 17 మందిపై కేసులు బనాయించారు. అనంతరం ఈ నెల 26న అర్ధరాత్రి ఫయాజ్‌బాషాను గుట్టుచప్పుడు కాకుండా అనంతపురానికి తరలించారు. రంజాన్ వేళ కుటుంబసభ్యులతో కలసి పండగ జరుపుకోవాలనే ఆయన విజ్ఞప్తిని పోలీసులు తిరస్కరిస్తూ వచ్చారు. ఆంక్షలు విధిస్తూ 4 రోజుల పాటు కుటుంబసభ్యులకు దూరం చేశారు. దీంతో ఈ నెల 29న అంజాద్‌బాషా, అనంత వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్సీ ఇషాక్, కర్నూల్ మాజీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, హజ్ కమిటీ మాజీ చైర్మన్ గౌసుల్ అజామ్ తదితరులు ఎస్పీ జగదీష్‌ను కలసి తాడిపత్రిలో జేసీ దౌర్జన్యాలపై ఫిర్యాదు చేసారు. ఫయాజ్‌బాషాను తాడిపత్రికి వెళ్లకుండా ఆంక్షలు విధించడంపై అభ్యంతరాలు వ్యక్తం చేసారు. దీంతో స్పందించిన ఎస్పీ ఆదేశాల మేరకు భారీ బందోబస్తు మధ్య ఆదివారం సాయంత్రం తాడిపత్రిలోని తన ఇంటికి ఫయాజ్ బాషా చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎలాంటి గొడవలు చోటుచేసుకోకుండా ఏఎస్పీ రోహిత్‌కుమార్, సీఐ సాయిప్రసాద్ ఆధ్వర్యంలో దాదాపు 150 మంది పోలీసులు తాడిపత్రిలోని పలు కూడళ్లు, ఫయాజ్ ఇంటి వద్ద బందోబస్తు చేపట్టారు.

ప్రాణం మీదకు తెచ్చిన హెడ్‌ఫోన్



గాయపడిన సూర్య

గుత్తి: హెడ్‌ఫోన్ పెట్టుకుని పాటలు వినాలనే మోజు.. చివరకు ప్రాణం మీదకు తెచ్చింది. వివరాలు... గుత్తి మండలం బాచుపల్లి గ్రామానికి చెందిన యువకుడు సూర్య శనివారం రాత్రి హెడ్‌ఫోన్ పెట్టుకుని పాటలు వింటూ స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలోని లచ్చానుపల్లి రైల్వే బ్రిడ్జి వద్ద పట్టాలు దాటే ప్రయత్నం చేశాడు. అయితే హెడ్‌ఫోన్ పెట్టుకోవడంతో అప్పటికే పట్టాలపై వేగంగా దూసుకువస్తున్న రైలును గమనించలేకపోయాడు. చివరిక్షణంలో అప్రమత్తమయ్యేలోపు రైలు ఢీకొనడంతో ఎగిరి పట్టాల అవతల పడ్డాడు. లోకో పైలెట్ నుంచి సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు అక్కడకు చేరుకుని స్థానికుల సాయంతో గాలింపు చేపట్టారు. పట్టాల పక్కన పడి తీవ్ర గాయాలతో పడి ఉన్న సూర్యను గమనించి వెంటనే గుత్తిలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి రెఫర్ చేశారు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

తాడిపత్రిలో చైన్‌స్నాచింగ్

తాడిపత్రి టౌన్: దైవ దర్శనం చేసుకుని బయటకు వచ్చేలోపు మహిళ మెడలోని బంగారు గొలుసును దుండగులు అపహరించారు. వివరాలు... తాడిపత్రిలోని జయనగర్ కాలనీకి చెందిన లక్ష్మీగోవిందమ్మ ఆదివారం సుంకులమ్మపాలెం వద్ద వున్న సుంకులమ్మ ఆలయానికి వెళ్లింది. ఉగాది పర్వదినం కావడంతో అప్పటికే ఆలయానికి భక్తులు పోటెత్తారు. రద్దీలోనే దైవ దర్శనం చేసుకుని బయటకు వచ్చిన అనంతరం తమన మెడలోని 4 తులాల బరువున్న బంగారం గొలుసు కనిపించలేదు. ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

రంజాన్ శుభాకాంక్షలు



వై.వెంకటరామిరెడ్డి



కేతిరెడ్డి పెద్దారెడ్డి

గుంతకల్లుటౌన్/తాడిపత్రి టౌన్: గుంతకల్లు తాడిపత్రి నియోజకవర్గంలోని ముస్లింలకు మాజీ ఎమ్మెల్యేలు వై.వెంకటరామిరెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. మానవాళి హితాన్ని ఆకాంక్షించే పవిత్రమైన రంజాన్ పర్వదినాన్ని ముస్లింలంతా భక్తి ప్రపత్తులతో చేసుకోవాలన్నారు. ప్రతి కుటుంబంలోనూ సంతోషం వెల్లివిరియాలని ఆకాంక్షిస్తున్నట్లు ఆదివారం వారు వేర్వేరు ఓ ప్రకటనల్లో పేర్కొన్నారు.

4న మండల సమావేశం

గుత్తి రూరల్: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఏప్రిల్ 4న మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ప్రభాకర్‌నాయక్, ఎంపీపీ గాండ్లపాటి విశాలాక్షి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, మండల కో-ఆప్షన్, జెడ్పీటీసీ, మండల స్థాయి అధికారులు హాజరు కావాలని వారు కోరారు. అధికారులు గడిచిన మూడు నెలల ప్రగతి నివేదికలు వెంట తీసుకురావాలన్నారు.

మద్యం విక్రేతల అరెస్టు

గార్లదిన్నె: మండలంలోని ఇల్లూరులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా తెలిపారు. ఆదివారం ఎస్ఐ మాట్లాడుతూ గ్రామంలో ఎలాంటి అనుమతులు లేకుండా మద్యం అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో మద్యం విక్రయిస్తున్న సురేష్, మహబూబ్ బాషాను అదుపులోకి తీసుకుని, వారి నుంచి 22 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు అమ్మవార్లకు బోనాలు

యల్లనూరు: మండలంలోని కొడవడ్లపల్లి పెద్దమ్మ, చింతకాయమంద అంకాలమ్మ, చిలమకూరు యల్లమ్మ తల్లికి సోమ, మంగళవారాల్లో భక్తులు మొక్కులు తీర్చుకోనున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి మూగజీవాలను బలిదానం చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. తెల్లవారుజామున నుంచి అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకోనున్నారు.

ఇమామ్‌పై ఆవు దాడి



గాయపడిన ఇమామ్ ఆఫీజ్ బాషా

గుత్తి: పట్టణంలోని ఎంఎస్ ఫుట్‌బాల్ క్రీడామైదానంలో ఆవులు కొట్లాడుకుంటూ వచ్చి మసీదు ఇమామ్‌పై దాడి చేశాయి.ఈ ఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. నాగుల బావి మసీదు ఇమామ్ ఆఫీజ్ బాషా బైక్‌లో వెళుతుండగా ఆవులు కొట్లాడుకుంటూ వచ్చి బైక్‌ను ఢీ కొన్నాయి. ఒక ఆవు ఇమామ్‌పై దాడి చేసింది. ఆవు దాడిలో ఇమామ్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు ఇమామ్‌ను ఆస్పత్రికి తరలించారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.


విద్యుదాఘాతంతో యువకుడి మృతి

కళ్యాణదుర్గం రూరల్: విద్యుత్ షాక్‌కు గురై ఓ యువకుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... కళ్యాణదుర్గం మండలం ఓబుళాపురం గ్రామానికి చెందిన నవీన్ (31), జయశ్రీ దంపతులకు ఏడాది వయసున్న కుమారుడు ఉన్నాడు. ఓబుళాపురంలోనే నివాసముంటూ కళ్యాణదుర్గంలో డయాగ్నస్టిక్ సెంటర్ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం కళ్యాణదుర్గంలోని తన వ్యాపార కేంద్రానికి వెళ్లేందుకు సిద్ధమైన నవీన్.. బాత్రూమ్‌లో స్నానం చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై కుప్పకూలాడు. బాత్రూమ్ నుంచి గట్టిగా శబ్దం రావడంతో అప్రమత్తమైన కుటుంబసభ్యులు వెంటనే తలుపు బలవంతంగా తీసి పరిశీలించారు. విద్యుత్ ప్రసరిస్తుండడంతో సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆఫ్ చేయించి క్షతగాత్రుడిని వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే నవీన్ మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

'శ్రీనివాసా'.. ఇదెక్కడి కర్రపెత్తనం!

ఆత్మకూరు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో పదో తరగతి విద్యార్థులను ఆ కేంద్రం చీఫ్ కర్రతో చితకబాదుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. పరీక్షలు ప్రారంభమైనప్పటి నుంచి శనివారం వరకూ దాదాపు ఐదారుగురు విద్యార్థులను ఆయన చితకబాదినట్లుగా బాధిత విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాలు... ఆత్మకూరు జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసప్రసాద్‌కు పరీక్ష కేంద్రం చీఫ్‌గా బాధ్యతలు అప్పగించారు. విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెంపొందిస్తూ పరీక్షలపై ఉన్న భయాన్ని పోగొట్టాల్సిన ప్రధానోపాధ్యాయుడు గాడి తప్పి ప్రవర్తిస్తున్నాడనే ఆరోపణలు వెల్లువెత్తాయి. శనివారం పరీక్ష రాస్తున్న స్థానిక కేజీబీవీ విద్యార్థినిని అకారణంగా కర్రతో కొట్టడంతో ఆమె చెయ్యి వాచిపోయింది. ఆదివారం చికిత్స కోసం స్థానిక పీహెచ్‌సీకి చేరుకున్న బాధితురాలు తాను పరీక్ష రాసేందుకు వెళ్లనంటూ ఏడుస్తూ కనిపించింది. తల్లిదండ్రులు, కేజీబీవీ ఉపాధ్యాయులు నచ్చచెప్పడంతో అప్పటికి సర్దుకుపోయింది. వారం క్రితం కూడా కురుగుంటకు చెందిన విద్యార్థినిని హెచ్‌ఎం కొట్టినట్లుగా సమాచారం. విద్యార్థులు తప్పు చేస్తే దండించాలి కానీ, చేతులు వాచేలా కర్రతో కొట్టడాన్ని తల్లిదండ్రులు తప్పుబడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలని కోరారు.

చదువుల వేటలో చతికిల



- అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి కాలనీ పంచాయతీ పరిధిలోని జీఎం కాలనీకి చెందిన హర్షవర్ధిని నగర శివారులోని ప్రైవేట్ జూనియర్ కళాశాలలో ఇంటర్ బైపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఇటీవల పబ్లిక్ పరీక్షలు రాసింది. పరీక్షలు సరిగా రాయలేకపోయానని, ఫెయిల్ అవుతాననే భయంతో ఇటీవల ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది.
- శ్రీసత్యసాయి జిల్లా లేపాక్షి మండలం పి.సడ్లపల్లికి చెందిన బాబు ప్రస్తుతం పదో తరగతి చదువుతున్నాడు. పబ్లిక్ పరీక్షలు సరిగా రాయలేకపోతున్నానని తరచూ బాధపడుతుండేవాడు. పరీక్షలు ఇంకా మిగిలి ఉండగానే తీవ్ర మనస్తాపానికి గురైన బాబు నాలుగు రోజుల కిందట ఒంటిపై పెట్రోలు పోసుకుని నిప్పంటించుకున్నాడు. చావుబతుకుల మధ్య ఆస్పత్రిలో కొట్టుమిట్టాడుతున్నాడు.

కొరవడిన విద్యా ప్రమాణాలు

- ఒత్తిళ్ల పరీక్షలు.. మార్కులే ప్రామాణికం
- అర్ధంతరంగా తనువు చాలిస్తున్న విద్యార్థులు
- జిల్లాలో ఇటీవల ఏడుగురు విద్యార్థుల బలవన్మరణం



అనంతపురం ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇటీవల చోటు చేసుకున్న విద్యార్థుల వరుస ఆత్మహత్యలు కలవరపెడుతున్నాయి. చదువు, పరీక్షలంటే ఆందోళన, ఒత్తిడి, కుంగుబాటు వంటి మానసిక సమస్యలు విద్యార్థులను ఆత్మహత్య దిశగా పురిగొల్పుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. చదువుల వేటలో చాలామంది విద్యార్థులు చతికిల పడుతున్నారు. పబ్లిక్ పరీక్షలు కాస్తా ఒత్తిళ్ల పరీక్షలుగా మారుతున్నాయి. ఫీజుల మాయలో పడ్డ కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థల్లో విద్యాప్రమాణాల గురించి ఏమాత్రమూ పట్టించుకోవడం లేదు. పిల్లలు ఎలాంటి పరిస్థితులనైనా తట్టుకుని సమాజంలో ధైర్యంగా బతకగలమనే మానసిక ధైర్యాన్ని నింపే చదువులు కాకుండా కేవలం మార్కులే ప్రామాణికంగా ఉంటున్నాయని మేధావులు వాపోతున్నారు. ఫలితంగానే చిన్నచిన్న సమస్యలను సైతం అధిగమించే ఆలోచన చేయలేని పిల్లలు శాశ్వతంగా లోకాన్ని వీడుతున్నారని చెబుతున్నారు. గత ఫిబ్రవరి 17న అనంతపురం శివారులోని ఎస్ఆర్ జూనియర్ కళాశాల ప్రథమ సంవత్సరం విద్యార్థి శ్రీకాంత్ కళాశాల సమీపంలోని ఓ చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందాడు. అంతకముందు గుత్తి రోడ్డు సమీపంలోని నారాయణ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థి చరణ్ మూడు అంతస్తుల పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. నగర శివారులోని బళ్లారి రోడ్డులోని ఓ ప్రైవేట్ కళాశాలలో సీనియర్ ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. ఇలా ఇటీవల కాలంలో ఉమ్మడి జిల్లాలో దాదాపు ఏడుగురు విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడ్డారు.

కానరాని మానసిక వికాస శిక్షణ

విద్యార్థుల భద్రత, వారి శ్రేయస్సుకోసం ప్రతి విద్యా సంస్థ చర్యలు తీసుకోవాలి. మానసిక కుంగుబాటుకు, ఒత్తిడికి లోనుకాకుండా మానసిక వికాస శిక్షణలు నిర్వహించాలి. నిపుణులతో పాటు సామాజిక సంస్థలతో తరచూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం వంటి చర్యలు చేపట్టాలని కూడా సుప్రీంకోర్టు సూచించింది. కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఇలాంటి శిక్షణలేవీ కనిపించవు. ర్యాంకుల సాధనే పరమావధిగా భావించే యాజమాన్యాలకు విద్యార్థుల శారీరక, మానసిక ఆరోగ్యం గురించి పట్టడం లేదని పలువురు వాపోతున్నారు. చాలామంది విద్యార్థుల తల్లిదండ్రుల ధోరణి కూడా ఇలానే ఉంది. మార్కుల మాయలో పడి పిల్లలను ఎప్పుడూ 'చదువు...చదువు' అంటూ ఒత్తిళ్లు చేస్తున్నారు.

ఆత్మహత్యే పరిష్కారం కాదు



'ఫెయిల్ అవుతామనో.. తల్లిదండ్రులు, బంధువులు, మిత్రుల ముందు తల ఎత్తుకోలేమన్న ఒత్తిడితోనో ఇబ్బంది పడాల్సిన పనిలేదు. మంచి మార్కులు వస్తే ఎలా సంతోషంగా ఉంటామో.. ఓటమి తలుపు తట్టినా చాలెంజింగ్‌గా తీసుకుని, గుండె ధైర్యంతో భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలి. ఫెయిల్యూర్‌కు ఆత్మహత్య పరిష్కారం కాదు.

– డాక్టర్ ఎండ్లూరి ప్రభాకర్,
మానసిక వైద్య నిపుణుడు



వైభవంగా ముసలమ్మ తల్లి తెప్పోత్సవం

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని తాడిపత్రి రహదారి పక్కన చెరువు కట్ట సమీపంలో వెలసిన ముసలమ్మ తల్లి తెప్పోత్సవాన్ని ముసలమ్మ తల్లి వంశీయులైన ఆలయ ధర్మ కర్త సుశీల, సూర్యనారాయణ రెడ్డి, గ్రామస్తులు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో అమ్మవారిని వివిధ పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం అమ్మవారిని పల్లకీపై అనంతపురం – తాడిపత్రి రహదారిపై ఊరేగించారు. ముసలమ్మ దేవాలయం పక్కనే ఉన్న అనంత సాగర్ (బీకేఎస్ చెరువు)లో అమ్మవారి తెప్పోత్సవం వైభవంగా నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి ఉత్సవాన్ని తిలకించారు.


బీకేఎస్ చెరువులో అమ్మవారి తెప్పోత్సవం (ఇన్‌సెట్‌లో) అలంకరణలో ముసలమ్మ తల్లి

2న బేతాపల్లిలో
ఊరు జాతర

గుత్తి రూరల్: మండలంలోని బేతాపల్లి గ్రామంలో ఏప్రిల్ 1, 2 తేదీల్లో ఊరు జాతర నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 1న అర్ధరాత్రి గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి మహిళలు పెద్దమ్మ తల్లి ఆలయం వరకూ బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పిస్తారన్నారు. గ్రామంలో జరిగే పెద్దమ్మ తల్లి ఊరు జాతరను భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

కోటకొండ తిరునాల ప్రారంభం

పెద్దవడుగూరు: మండలంలోని కోటకొండ ఆంజనేయస్వామి తిరునాల ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా అర్చకులు ఆంజనేయస్వామి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. మొళకత్నాళ్ల గ్రామంలో అనంతగిరినాథ స్వామి ని ప్రత్యేకంగా అలంకరించి చిత్రచేడు గ్రామం వరకూ పల్లకి ఊరేగింపు నిర్వహించారు. ఏటా ఉగాది రోజు తిరునాల నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మరరాష్టంతోపాటుఇతర రాష్ట్రాల నుంచి భక్తులు హాజరవుతారన్నారు.


అలంకరణలో కోటకొండ ఆంజనేయస్వామి

కసాపురంలో భక్తుల సందడి


కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానం వద్ద భక్తుల కోలాహలం

గుంతకల్లు రూరల్: కోరిన కోర్కెలు తీర్చే దైవంగా, భక్తుల కొంగు బంగారంగా ప్రసిద్ధి చెందిన కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో ఏటా మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా జరిగే ఉగాది ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో పాల్గొనేందుకు భక్తులు సుదూర ప్రాంతాల నుంచి భారీ ఎత్తున తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిశాయి. ఆంజనేయ స్వామి నామస్మరణతో ఆలయ పుర వీధులు మార్మోగాయి. బెంగుళూరు నుంచి తెప్పించిన ప్రత్యేక పుష్పాలతో ఆలయాన్ని అలంకరించారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మొదటిరోజు పంచాంగ శ్రవణం, రాత్రికి గ్రామోత్సవం కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం వేకువజామునే స్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించిన అర్చకులు వజ్ర కవచ అలంకరణలో ప్రత్యేక పుష్పాలతో మూలవిరాట్‌ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ వేలాదిమంది భక్తులు స్వామివారిని దర్శించుకుని ఆలయంలో ఆకుపూజలు, వడమాల పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక వేదికను ఏర్పాటు చేసి ఆలయ వేద పండితులు, అర్చకుల ఆధ్వర్యంలో విశ్వావసునామ సంవత్సర పంచాంగ శ్రవణాన్ని భక్తులకు వినిపించారు. అనంతరం సీతారామలక్ష్మణ సహిత ఆంజనేయస్వామి వార్లను గరుడవాహనంపై కొలువుదీర్చి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయం నుంచి పురవీధుల్లో గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అడుగడుగునా భక్తులు కాయ కర్పూరం సమర్పించి, స్వామివారిని దర్శించుకుని తరించారు.

నేడు రథోత్సవం

ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నారు. ఆలయ ముందుభాగంలో రథాన్ని నిలిపి రథోత్సవం ముందు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం సీతారామలక్ష్మణ సహిత ఆంజనేయస్వామి వార్లను రథంలో కొలువుదీర్చి రథోత్సవం నిర్వహిస్తారు. రథోత్సవాన్ని తిలకించడానికి చుట్టుపక్కల గ్రామాలు, జిల్లాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. భక్తుల సౌకర్యార్థం ఆలయంలో అన్ని సౌకర్యాలను సమకూర్చారు.

రేపు లంకాదహనం

ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు ఆలయ ముందు భాగంలో లంకాదహనం కార్యక్రమం నిర్వహిస్తారు. ఈసందర్భంగా నెట్టికంటి ఆంజనేయస్వామి వారిని స్వర్ణాభరణాలు, ప్రత్యేక పుష్పాలతో అలంకరించి ఒంటె వాహనంపై కొలువుదీర్చి ఆలయ అనుబంధ దేవాలయమైన కాశీ విశ్వేశ్వరాలయం వరకూ ఊరేగిస్తారు. అక్కడ కాశీ విశ్వేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆంజనేయస్వామి చేతుల మీదుగా లంకాదహనం కార్యక్రమాన్ని నిర్వాహకులు ప్రారంభిస్తారు.

సాంస్కృతిక కార్యక్రమాలు:

ఉత్సవాలు జరుగనున్న మూడు రోజుల పాటు భక్తుల కాలక్షేపం కోసం ఆలయ సమీపంలోని గంగా నిలయం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదిక్పై వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వివిధ రాష్ట్రాల నుంచి కళాకారులను రప్పిస్తారు.


నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానం వద్ద సేద తీరుతున్న భక్తులు